# 38. రామాంజనేయ కళ్యాణం

రామాయణం అంతా ఓపిగ్గా విన్న ఓ సందేహాల సుబ్బయ్యగారు తీరిగ్గా పురాణం చెపుతున్న శాస్త్రులుగార్ని ప్రశ్నించేట్ట: "అయ్యా, ఇంతకూ సీతమ్మవారు రాములయ్యవారికి ఏమవుతారు?" అని.

సదరు శాస్త్రుర్లుగారు ఉత్తశాస్త్రుర్లేగానీ ఆదిభట్ల నారాయణదాసు గారంతటి పండితులు గారు. ఆయనే అయితే అప్పటికప్పుడే ఏదో థియరీ చెప్పి సుబ్బయ్యగారి సందేహాలకు ఫుల్‌స్టాప్ పెట్టేసి. ఆ బాపతువాళ్ళ నోళ్ళు పెర్మనెంటుగా మూసేసి ఉండును.

ఎందుకంటే...!

హరికథా పితామహులుగా సుప్రసిద్ధులైన శ్రీ మజ్జాడాదిభట్ల నారాయణదాసుగారు ఓ ఊళ్ళో హరికథ చెప్పేందుకు వెళ్ళినపుడు సభలో ముందు వరసలో కూర్చున్న ఊరి మోతుబరుల్ని చూసి సవినయంగా "అయ్యా, ఈ రోజు హరికథ చెప్పుదునా? గిరి కథ చెప్పుదునా?" అని అడిగేరుట.

అందుపై ఆ మోతుబరులు "ఎవడ్రా! ఈ మాటల ట్విస్టుగాడూ! యింత నిర్లక్ష్యంగా హరి గిరి అంటున్నాడూ

అనుకుని లోలోన ఆగ్రహించుకున్నవారై. "సరే గిరికథ చెప్పవయ్యా" అన్నారుట హేళనగా.

మరుక్షణం నారాయణదాసుగారు చిడతలందుకుని "గిరిజా కల్యాణం" కథ మొదలెట్టి సదస్యులెల్లరూ సంభ్రమం లోంచి తేరుకునేలోగా వారందర్నీ మంత్రముగ్ధుల్ని చేసినట్లుగా "గిరి కథ' పూర్తి చేసేరుట.

పాండిత్యం అంటే అదిగదండీ! మరి. మన రామాయణ పురాణం చెప్తూన్న శాస్త్రిలుగారికి అదిలేదు. కనుక-

"రామాయణంలో నీ పిడకల వేట ఏమిట్రా సుబ్బడూ! పాపప్రశ్నలు వెయ్యకు: సిడ్డౌన్!" అనరిచేరుట. ఆ వెంటనే మిగిలిన శ్రోతలు కూడా అందుకుని 'ఓ! యస్! సిడ్డౌన్: డౌన్! డౌన్!" అనరుస్తూ సదరు సందేహాల సుబ్బయ్యగార్ని గోచీ పుచ్చుకు లాగి మరీ మందలో కూల వేసేరుట! "సందేహం అనే దానికి కాస్త నాజూకయిన పేరు జిజ్ఞాస అదే గనుక లేకుంటే మనం ఈనాడిలా ఉండగలిగేవారిమే కాదు." మీరుగాని, టార్జాన్ సిన్మాలు చూశారా: అందులోని హీరోలా కోతుల్తో కాలక్షేపం చేస్తూ మనం కూడా చెట్లమీద బ్రతుకుతూండేవాళ్ళం సుమండీ!" అంటారి సుబ్బయ్యలు.

ఇంతకూ సీత రాముడి కేమవుతుంది? అనే సందేహం రామాయణం చదివేవారికే వచ్చినట్లుందికానీ శాస్త్రిల వారి పురాణం విన్న వారందరికీ వచ్చినట్టులేదు. అందుకేనేమో:

పవిత్ర గ్రంథాల్ని అపవిత్రులూ, సుబ్బయ్యలూ చదవరాదని శాసించారు మన పెద్దలు. రామాయణం తెలుగులో తొలి సారి అచ్చేసిన పబ్లిషర్లు అందుకోసం పరమపవిత్రులైన సద్బ్రా హ్మల్ని కొందర్ని పోగుచేసి వారికి కంపోజింగ్ నేర్పి మరీ వారిచేతే రామాయణం మైలపడిపోకుండా కంపోజు చేయించి అచ్చేయించారట. ఈనాడంటే కలికాలం గనుక అలాంటి శ్రద్ధాసక్తులు కరువైపోయాయనుకోండి.

వెనక గురజాడవారు రాశారు. "ఈ దేశంలో సీతమ్మ వారు జలకమాడని గుంటలూ, రాములవారి కాళ్ళు తగిలి పవిత్రంగాని గులకరాళ్ళూ లేవ''ని.

"నిజమే! కనుకనే మనది పవిత్ర భారతం అయింది. లేకుంటే ఇలాంటి తోకలు మనకు ఊరికే దొరికాయా! గుడి లేని ఊరుండదు మనదేశంలో. ప్రతి గుడిలోనూ ఓ చీకటి గదిలో రాములవారో, వారి బంధువులో ఎవరో ఒకరు వేం చేసి ఉండి, మనవద్ద టెంకాయలు పుచ్చుకుని పాపాలు ఏరోజు కారోజు చిల్లరగా గానీ,వారానికో శనివారం హోల్ సేల్ గా గానీ కడిగేస్తుంటారు.

ఇందుకు మనం కృతజ్ఞులమై ఉండాల్సింది పోయి మనలో పిలక ప్రశ్నలూ, పిడక సందేహాలు పైకి తెచ్చే సుబ్బయ్యలెక్కువయిపోవటం ఘోరం.

రాముడు సీతనోసారి అగ్నిలోకి దింపించి మర్డర్

కేసుకు పాలయ్యాడు గదా! మరోసారి డ్రైవోర్సిచ్చి అడవికి పంపేశాడు గదా! ఇంకోసారి ఇంకేదో చేశాడు గదా! ఈ లెక్కన సీతమ్మగారు రాములవారికి ఏమవుతుంది? అని అడుగుతారీ సుబ్బయ్యలు. వీళ్ళు బహుశా సీతారామ యుద్ధం సిన్మాచూసి ఉండరు. రామాంజనేయ కళ్యాణం కూడా చూసి ఉండరు. అందుకే ఇలాంటి ప్రశ్నలకు వారికి జవాబులు దొరకవు. వీరిని చూసి జాలిపడటం మినహా మరేం చేయగలం చెప్పండి!

ఈ మధ్య ఇంకో రకం సుబ్బయ్యలు బయల్దేరారు. రామలీలలు జరపటం దుర్మార్గం గనుక రావణలీలలు జరుపుదాం అంటున్నారు వీరు. రామలీలా ఉత్సవాల్లో రావణుడిని తగలేస్తున్నారు. రాముడు ఆర్యుడు. రావణుడు ద్రవిడుడు. మనం ద్రావిడులం. కనుక రాముడిని తగలేయటం ద్రవిడ న్యాయం! అని వీరివాదం. ఆర్యులెన్నెందుకు తగలెయ్యాలో మాత్రం వీరు చెప్పరు. లోగడ తమిళనాడులో రామస్వామి నాయకర్ గారు దేవుళ్ళ బొమ్మల్ని పబ్లిగ్గా ఊరేగిస్తూ వారిని చెప్పుదెబ్బల్తో సత్కరిస్తూ ఆ విధంగా జనంలో వారికి అయిష్టులైన దేవుళ్ళమీద ఏహ్యాభావం కలిగించేందుకు ప్రయత్నించేరు, ఫలితంగా తమిళనాడులో రాములవారి బొమ్మలు మిగిలాయో లేదోగానీ, వారి బంధువర్గంలో వారే అయిన బాలమురుగన్ లాంటి దేవుళ్ల బొమ్మలు మాత్రం నేటికీ విరివిగానే ఉన్నాయి. ఈ మిగిలినవాళ్ళు బహుశా ద్రవిడ దేవుళ్లేనేమో! మంచివాళ్లు కూడా నేమో!

ఇంతకూ ఎవర్నయినా అసలు ఎందుకు తగలేయాలి? అని సుబ్బయ్యలు లోతుగా ఆలోచించినట్టు లేదు. 'ఏమంటా వురా'' అనడిగేను మా రాస్కేల్ను.

"ఏడాదికోసారి, ఒకణ్ణే తగలేస్తే ఏం సర్దా నాన్నా. రోజుకొకణ్ణి తగలేస్తే బాగుణ్ణు గదా! మాకు స్కూలుకు శెలవులు కూడా దొరుకుతాయి గదా!" అన్నాడు వాడు,

ఔరా! అనిపించింది నాకు మావాడికి తగలేయటంలో కొంత సరదా, ఇంకొంత సొంత లాభం కనిపించింది. అందు కోసం రోజుకు ఒకరికి చొప్పున ఎసరు పెట్టటాని క్కూడా వాడికి అభ్యంతరంలేదు. అలాగే రామస్వామి నాయకర్ గారి శిష్యులక్కూడా, తర్వాత్తర్వాత మంత్రి పదవులు దొరికాయి గనుక వారికీ తగలేయటం ఎందుకనే ప్రశ్నరాదు. వారి జోలికి ఎవరూ పోరు కూడా. పైగా మీరు తగలేస్తుంటే సర్దాగా తమాషా చూస్తూ హుషారిస్తుంటారు కూడా. గాను గెద్దుల్లా తయారయిన జీవాలకు అడపా దడపా ఇలాంటి సర దాలు రుచి చూపకపోతే వారేమయినా అయిపోగల ప్రమా దం ఉంది గదండీ!

కానీ, మరోరకం వారున్నారు. వారికి దేన్నయినా ఎందుకు తగలేయాలో తెలుసు. ఎలా తగలేయాలో కూడా తెలుసు.

బాగానే ఉంది. కానీ, వచ్చిన ఇబ్బందేమంటే ఇలాంటి

వారిని అర్జంటుగా తగలేసేందుకు "ఎప్పుడో తగలేశాం" అని "తగలెయ్యండి" అని కబుర్లు చెప్పేవాళ్ళు గోచీలు బిగించ బూనుకోవటం.

దీని సారాంశం ఏమనిపిస్తూన్నదంటే:

"సీత రాముడి కేమవుతుంది?" అని అడగటానికీ, "అసలు సీత ఎవరు? రాముడెవరు? వీళ్ళు దేవుళ్ళ లా అయ్యారు?" అని అడగ గలగటానికి పెద్ద భేదం ఉందని.

అలాగే.

దేవుళ్ళ బొమ్మల్నీ, వాళ్ళ పురాణాలున్న పుస్తకాల్నీ తగలేయటానికీ, మన మనుసుల్లో వాళ్ళపట్ల జీర్ణించుకుపోయి ఉన్న నమ్మకాల్ని తగలేయ జూడటానికీ కూడా పెద్ద భేదం ఉందని.

అవునా!

ఆ లెక్కన "సీత రాముడికి ఏమవుతుంది?" అనడిగే ప్రముఖుల్ని సిద్ధాంత్ అనాల్సిందే గదా!

(ఫిబ్రవరి 1975)